
# గొలుసు కథ - 11 తీవ్ర ప్రణాళి

శర్మ, వెంకోజీ, రామకృష్ణలను రెండవ దఫా పోలీసులు పట్టుకెళ్ళడం వారి వారి కుటుంబ సభ్యులకు చాలా బాధ కల్గించింది.




డి.సి.టి.ఒ. యింట్లోనూ, కలెక్టరింట్లోను జరిగిన దొంగతనాలకి యీ ముగ్గుర్నీ బాధ్యులనడం, వీరిని గజదొంగలుగా ముద్రవేసి, పట్టుకెళ్ళడం సహించరాని ఘోరంగా పరిగణించి, రామకృష్ణ తండ్రి, శర్మ, వెంకోజీల మామగార్లు కలిసి, పోలీస్ కమిషనర్ భాస్కర్ యింటికి వెళ్ళారు.

తానిప్పుడేమి చెప్పలేనని, తర్వాత కలవమని వారిని పంపాడు భాస్కర్.

గత్యంతరం లేక, వారు లాయర్ ద్వారా ఆ ముగ్గుర్నీ మళ్ళీ జామీను మీద బయటకు తెచ్చారు. అలా లేకపోతే, వారి ఉద్యోగాలు 'హరీ' అంటాయి.

అంతా కలిసి హోం మినిస్టర్ కడగండ్ల వెంగళరావు గారింటికి వెళ్ళారు.

ఆ ముగ్గురు మిత్రుల్ని అరెస్ట్ చేసిన వెంటనే జైల్లో కలిసాడు భాస్కర్. తన మామగారు వ్రాసిన జాబుని వెంకోజీకిచ్చి చదవమన్నాడు.

''చిరంజీవి అల్లుడికి''

మీ మామ సమానుడైన 'క్షురుగు' దీవించి వ్రాయు నది. నీమీద యెవరికీ సందేహం రాకూడదని యిలా 'మామ' వేషం వేసి రాస్తున్నా!

ఇవాళ వ్యాపారంలో నీవాటా మూడు లక్షల రెండు వేల రెండొందలు. డ్రాఫ్టు పంపుతున్నాను. నాకింకా వచ్చిందంతా రొక్కంగా మారకపోయినా, నీకు మాత్రం ఆలస్యం చేస్తే, అమృతం విషం అవుతుందని యెలాగో తంటాలుపడి పంపిస్తున్నా. యెడ్జెస్ట్ చేసుకో!

నువ్వు భాగస్థుడివైన వేళా విశేషం బాగుంది. తేలిగ్గా వ్యాపారం జరుగుతూంది.

ఉంటామరి!

ఇట్లు
నీ మామసమాన, క్షురుగు

జాబు చదివి వెంకోజీ అయోమయంగా చూచాడు. దాన్ని తీసుకొని జేబులో పెట్టుకున్నాడు భాస్కర్.

''వేళాకోళానికైనా ఒక హద్దుండాలి! పట్టపగలు మాయింట్లో నుండి సోఫా దొంగిలించడమే గొప్ప నేరం! యేదో స్నేహితుడివికదా అని, సీరియస్‌గా తీసుకోకుండా వదిలిపెడితే, నన్ను ఫూల్‌ని చెయ్యాలని, మీ ముగ్గురూ అతి తెలివితేటలు ప్రదర్శిస్తారా? మతులు పోయే దొంగ తనాలు చేసి, నాకే వాటాలు పంపుతారా? ఇక మిమ్మల్ని మన స్నేహం కాదు గదా, ఆ బ్రహ్మ దేవుడు కూడా కాపాడలేడు! అనుభవించండి!'' అని విసురుగా వెళ్ళి పోయాడు భాస్కర్.

అది విని, ముగ్గురు అచేతనులై నిలబడ్డారు.

ఆ సాయంత్రం ఐ.జి., కలెక్టర్ కూడా భాస్కర్ వెంట జైలుకొచ్చి ముగ్గురు ముద్దాయిలను చూచారు. వారు, తాము 'నిరపరాధులం' మొర్రో అన్నారు!

'అవి గోముఖ వ్యాఘ్రాలని, ఆ మాటలు నమ్మ వద్దని అన్నాడు భాస్కర్.

భాస్కర్ తెలివితేటల్ని మరోసారి మెచ్చుకొని, అభి నందించాడు ఐ.జి.

కడగండ్ల వెంగళరావు ఇన్‌స్పెక్టర్ జనరల్‌ని ఫోన్‌లో పిలిచారు. ముగ్గురు ముద్దాయిల విషయంలో మరోసారి పరిశోధన గావించమని, తనకెందుకో వారు నిర్దోషులని పిస్తుందని అన్నారు.

కానీ, ఐ.జి. అంగీకరించలేదు. కమిషనర్ భాస్కర్ చాల గట్టివాడని, అతను పరిశోధించిందేనని అన్నాడు.

''ప్లీజ్ ఇన్‌వెస్టిగేట్ వన్స్‌యెగైన్!'' అని ఫోన్ పెట్టేసారు మంత్రి.

ఐ.జి. భాస్కర్‌ని పిలిచి, జరిగింది చెప్పారు. తాను యెంతగట్టిగా వాదించి, భాస్కర్ యిన్‌వెస్టిగేషన్ ఫెయిల్‌కాదని చెప్పిందీ వివరించారు. భాస్కర్ సంతోష పడి థాంక్స్ చెప్పాడు.

"ఇంతకీ, కలెక్టర్‌గారింటిని యెలాదోచారంటావు?" ఐ.జి. అడిగాడు.

"ఆ రిక్షావాడు యిల్లూ, పరిసరాలూ, యింట్లో కలెక్టర్‌గారి భార్య, దొడ్లో పనివాళ్ళు, బయట సెంట్రీ తప్ప యెవ్వరూ లేరని గ్రహించాడు. మేడమ్ బయటి కెళ్ళగానే, సెంట్రీకళ్ళుకప్పి, లోపలికి ప్రవేశించవచ్చు!" భాస్కర్ అంటూండగా, ఐ.జి. టేబుల్ మీది ఫోన్ మ్రోగింది.

"ఆలీఖాన్, రిక్షావాడు, పైన సూపర్‌వైజ్ చేసేవాడు మొత్తం ముగ్గురు, ఆ ముగ్గుర్నే యిప్పుడు మనం పట్టు కున్నది." భాస్కర్ అన్నాడు.

ఐ.జి. టెలిఫోన్ తీసి 'హలో' అన్నాడు. అమీర్ పేట పోలీస్ స్టేషన్ నించి ఎస్.ఐ. మాట్లాడుతున్నాడు.

'వీడియో రికార్డర్‌ని అమ్మటానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని పట్టుకున్నామని, పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చి యింటరాగేట్ చేస్తే, స్కూటర్ బాగ్‌లో స్వీట్సు సినిమా టిక్కెట్లు పెట్టే యిళ్ళు దోచిందీ, డి.సి.టి.ఓ. గారిల్లు దోచిందీ, కలెక్టర్‌గారిల్లు దోచిందీ తానేనని చెబుతున్నాడ'న్నాడు.

అదివిని చిరాకుపడ్డాడు ఐ.జి. భాస్కర్‌కి చెప్పి 'యేమిటీ నాన్‌సెన్స్' అన్నాడు.

భాస్కర్ విస్తుపోయాడు. అలా జరగడానికి వీల్లేదు! మళ్ళీ అమీర్‌పేటకు ఫోన్ చేశాడు. వాడు చెప్పింది విని నీరయ్యాడు.

అంతలో హోం మినిస్టర్ మరోసారి ఐ.జి.ని ఫోన్‌లో పిలిచాడు.

ఐ.జి. కంగారుపడుతూ, క్షమాపణలు చెప్పుకొని, అసలు దొంగ దొరికాడని, మొదట పట్టుకున్న ముగ్గురూ నిర్దోషులేనని, కేసు రద్దు చేయిస్తున్నానని అన్నాడు.

"దీనికంతకూ కారకుడైన, ఆ కమిషనర్ భాస్కర్ మీద తగిన చర్య తీసుకుని, నాకు తెలియపర్చండి!" మినిస్టర్ ఆజ్ఞ!

"అలాగే సార్! అతనిని వెంటనే కమిషనర్ పదవి నుండి రివర్టు చేయిస్తా! ఐయామ్ వెరీ సారీ!" వణుకుతూ అన్నాడు ఐ.జి.

"తీసుకుంటున్న జీతాలకు న్యాయం చేసేలా వళ్ళు వంచి, బుర్ర నుపయోగించి, పనులు చెయ్యండి. ఇలా గుడ్డిగా ప్రవర్తిస్తే, ప్రజల ముందు తలవంపులయ్యేది నాకు! అర్థమయ్యిందా!" హోం మినిస్టర్ గర్జన.

"అలాగే సార్!"

"రోడ్ల మీద పగలూ, రాత్రీ కూడా కత్తిచూపి, దోచుకోవడాలూ, జేబులు కొట్టడాలూ, ఆడవాళ్ళ మెళ్ళో నగలు తెంపుకుపోవడాలూ, రాత్రిపూట హెడ్ లైట్లు లేకుండా సైకిళ్ళు, ఆటోలు, మోటారు సైకిళ్ళు, కార్లూ, లారీలు ప్రమాదాలు చేసి, పారిపోవడాలు, ఇళ్ళు దోచుకోవడాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవన్నీ అదుపులోకి రావాలి! రేపు అసెంబ్లీ శీతాకాలపు సమావేశాల్లో దీనిమీద వచ్చే చర్చకి, ఈ రకం నేరాలన్నీ తగ్గిపోయినట్లు నేను ఋజువు చెయ్యాలి! వెంటనే తగిన చర్యలు తీసుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. ఓ.కే.?" మంత్రిగారడిగారు.

"అలాగే సార్! ఉంటా మరి!" చెమటలు తుడుచు కున్నాడు ఐ.జి.

"విన్నావుగా! ఇంకా చూస్తావేం? పద అమీర్‌పేట పోలీస్ స్టేషన్‌కి!" భాస్కర్‌వంక తీక్షణంగా చూస్తూ లేచాడు ఐ.జి. భాస్కర్ మౌనంగా అనుసరించాడు.

అమీర్‌పేట పోలీస్ స్టేషన్లో, యిరవైయేనిమిదేళ్ళ వ్యక్తి బంధింపబడి వున్నాడు. నున్నని గుండు, నున్నగా చేసుకున్న గడ్డం, చురుకైన కళ్ళు, అయిదున్నరడుగుల పొడవు, అంత లావూ, సన్నమూ కాని దేహం.

పట్టుబడ్డ సమయంలో చక్కని క్రాపు, గుబురు మీసాలు వున్నాయట. ఇంటరాగేషన్‌లో అవి పెట్టుడు మీసాలని, నెత్తిన వున్న జుట్టు విగ్గని తేలింది.

'స్టరుగు' పేరుతో వుత్తరాలు రాసింది తానేనని ఒప్పు కున్నాడు. బుర్ర వుపయోగించి చేసిన గొప్ప దొంగ తనాలు తనవేనని మరోసారి అంగీకరించాడు.

యెంతెంత మొత్తాలకి డి.డి.లు పంపావని భాస్కరడిగాడు.

రెండు డి.డి.ల మొత్తాన్ని తు.చ. తప్పకుండా చెప్పాడు.

"అంతంత దొంగతనాలు చేసి, లక్షల కొద్దీ డబ్బు పంపాయించినోడు నీలా వుండడే?" ఐ.జి. అడిగాడు.

"అవును! చాలా ఆడంబరంగానే వుండాలి! అలాగే వున్నాడు మరి!" స్టరుగు అన్నాడు.

"ఎవరది? నేను నీగురించి అడుగుతున్నాను.!"

"అందంగా యిల్లు కట్టినంత మాత్రాన ఆ తాపీ మేస్త్రీ యింటి వోనరు కాలేదు కదండీ! నేనూ అలాంటి మేస్త్రినే! అంతా మాబాస్‌కే చెందుతుంది!" అన్నాడు.

"మీ బాసా! వాడెవడ్రా మధ్యలో?" ఐ.జి. గదిమాడు.

"అమ్మో! కడుపులో నొప్పి! లెట్రిన్ కెళ్ళొస్తా!" అంటూ, లోపలికి పరుగుపెట్టాడు స్టరుగు.

"భాస్కర్! ఐకాంట్ యెక్స్‌క్యూజ్ యూ!" అంటూ ఆఫీసు రూంకేసి సాగారు ఐ.జి.

(పై వారం)

